క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తిరుపతి పార్లమెంట్ వ్యయ పరిశీలకుడిగా నియమితులైన పరదీప్‌కుమార్ కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు మహాత్మాగాంధీకి సంబంధించిన పుస్తకాన్ని అందజేశారు. అనంతరం జిల్లాలో ఎన్నికల ప్రక్రియపై పరస్పరం చర్చించారు.

నేటి నుంచి శబరి శ్రీరామ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): రాంనగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో శనివారం నుంచి కోదండరామస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు క్షేత్ర నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సాయంత్రం 6గంటలకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నట్లు చెప్పారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు.ఏపీఎస్‌ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్‌ఈ విజయన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. అనంతరం విద్యుత్ భవన్‌లో పనిచేస్తున్న పేద ఒప్పంద ఉద్యోగులకు ఏపీఎస్‌ఈబీ జనరల్ సెక్రటరీ రమేష్‌బాబుతో కలిసి వస్త్రాలు పంపిణీ చేశారు. విద్యుత్‌శాఖ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు ప్రసన్నకుమార్, బెనర్జీ, జేఏసీ నాయకులు ఎస్‌కే అల్తాఫ్, శ్రీధర్, శేషారెడ్డి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

మే 5న అభినయ ఆర్ట్స్ దశమ నాటకోత్సవం

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో మే 5న 'అభినయ ఆర్ట్స్' దశమ నాటకోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు సీఆర్ రాఘవ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను మాగుంటలేఅవుట్, లెక్చరర్స్ కాలనీలోని అభినయ ఆర్ట్స్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాఘవ మాట్లాడుతూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు ఈ నెల 30లోగా 94406 75070 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సినీ సంగీత విభావరి, నృత్యప్రదర్శనలు, రాత్రి 8 గంటల నుంచి పులుగుండ్ల రామకృష్ణయ్య రచన 'తుపాను' నాటికను తన స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రముఖ మాటల రచయిత పిడూరుకు చెందిన ఎం రత్నంను ఘనంగా సత్కరించనున్నట్లు చెప్పారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. దగ్గుపాటి రాధాకృష్ణ, మురళీమోహన్‌రావు, ఎస్‌ఏ షరీఫ్, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు సిటీ: పని నిమిత్తం వెళ్లిన భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య రూరల్ పోలీసులకు ఆశ్రయించింది. వివరాలు..కలువాయి మండలం దాచూరుకు చెందిన నరసయ్య(42), పెంచలమ్మ చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 13న నరసయ్య విడవలూరులోని తన బంధువు కొమరిగిరి కృష్ణ ఇంటికి పని నిమిత్తం వెళ్లారు. రెండ్రోజులు గడిచినా నరసయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో కృష్ణను పెంచలమ్మ ఆరాతీయగా మల్లికార్జునపురానికి చెందిన కొందరితో కలిసి తప్పెట్లు వాయించేందుకు నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాళేనికి వెళ్లారని చెప్పాడు. అక్కడికి తీసుకెళ్లిన వారిని ఆరాతీయగా పని పూర్తయిన తరువాత నరసయ్య ఎటు వెళ్లారో తమకు తెలియదని చెప్పారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించినా ఫలితం లేకపోవడంతో భార్య పెంచలమ్మ రూరల్ పోలీసులను ఆశ్రయించారు. రూరల్ పోలీసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్ల సమావేశం

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ సంఘ భవనంలో రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు గౌస్ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్కే కాలేషాసాహెబ్ వృద్ధాప్యంలో తలెత్తే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. సుశీల నేత్రాలయ డాక్టర్ అమృత ఆధ్వర్యంలో పెన్షనర్లకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనాథ్, కోశాధికారి హజరత్తయ్య, ఉపాధ్యక్షులు ఖాసిం, గోపాల్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తన గెలుపునకు నాందిగా నిలుస్తాయని ఆ పార్టీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. 51వ డివిజన్ సుబేదారుపేట, 52వ డివిజన్ ఇసుకడొంక, తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. నగరాభివృద్ధికి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్యుడిని అయిన తనకు అవకాశం కల్పించారన్నారు. తనను ఆశీర్వదిస్తే నగర ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఫ్యాన్ గుర్తుపై ఓటేసి నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ కాయల సాహిత్య, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చులపై ప్రత్యేక దృష్టి

- నెల్లూరు పార్లమెంట్ వ్యయపరిశీలకుడు ప్రసాద్ దత్తాత్రేయ



మాట్లాడుతున్న నెల్లూరు పార్లమెంట్ వ్యయ పరిశీలకుడు ప్రసాద్‌దత్తాత్రేయ

నెల్లూరు(బారకాసు): 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల ఖర్చులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు జీ ప్రసాద్ దత్తాత్రేయ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రిటర్నింగ్, నోడల్ అధికారులతో ఎన్నికల వ్యయ పరిశీలకులు జీ ప్రసాద్‌దత్తాత్రేయ, కంచన్‌రామ్‌మీనా, జోతిమోయ్‌బైలంగ్‌లు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లాలో ఎన్నికల ప్రక్రియకు చేపట్టిన కార్యక్రమాలు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, పోలీసు బృందాల పనితీరును జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వ్యయ పరిశీలకులకు వివరించారు. ఓటింగ్‌ను 85శాతానికి పెంచేందుకు ఓటరు చైతన్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్‌దత్తాత్రేయ మాట్లాడుతూ స్వేచ్ఛగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థుల ఖర్చులు లెక్కింపులో అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ల పాత్ర చాలా కీలకమన్నారు. అభ్యర్థుల నామినేషన్ల ర్యాలీలు, ప్రచార ఖర్చులను పూర్తిగా వీడియోగ్రఫీ చేసి లెక్కించాలన్నారు. బ్యాంకు లావాదేవీలు, యూపీఐ ట్రాన్సెక్షన్లపై ప్రత్యేక నిఘా ఉంచి పరిశీలించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టీ బృందాలు ముమ్మర తనిఖీలు చేపట్టి మద్యం, నగదు అక్రమ రవాణాను కట్టడి చేయాలన్నారు. ప్రతి నామినేషన్ ర్యాలీని వీడియోగ్రఫీ చేసి ఖర్చులను అభ్యర్థుల ఖాతాలో నమోదు చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్, ఎస్ఎస్టీ బృందాల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీ సౌజన్య, రిటర్నింగ్ అధికారులు వికాస్‌మర్మత్, సేతు మాధవన్, విద్యాధరి, చిన్నఓబులేసు, మలోల, శీనానాయక్, మధులత, డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను విధిగా వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల విధుల్లో పాల్గొనే కార్పొరేషన్ సిబ్బంది విధిగా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని నెల్లూరు సిటీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, కమిషనర్ వికాస్‌మర్మత్ సూచించారు. కార్పొరేషన్‌లోని అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సూపరింటెండెంట్లు, బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతిఒక్కరూ ఫారం–12 దరఖాస్తు చేసుకుని పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతులు పొందాలని సూచించారు. మూడు లేదా అంతకన్నా ఎక్కువ పోలింగ్ కేంద్రాలను కలిగి ఉన్న భవనాల ప్రాంగణంలో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి ఓటర్లకు అవసరమైన అత్యవసర సేవలను అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఆర్వోలు శర్మద, దేవీకుమారి, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, మేనేజర్ ఇనాయతుల్లా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా వార్షిక బ్రహ్మోత్సవాలు



మూలాపేటలో శేష వాహనంపై వేణుగోపాలస్వామి



ఉస్మాన్‌సాహెబ్‌పేటలో శేషవాహనంపై కోదండరామస్వామి

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ శుక్రవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి వేణుగోపాలుడు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.ధ్వజారోహణకు నాగారెడ్డి శ్రీనివాసులురెడ్డి కుటుంబ సభ్యులు, శేష వాహన సేవకు పరిమి వెంకట జయచంద్రశర్మ, కామేశ్వరి దంపతులు వ్యవహరించారు.

- సంతపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి ఆంజనేయస్వామి హంస వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉభయకర్తలుగా నట్టం శేషమ్మ జ్ఞాపకార్థంగా వారసులు వ్యవహరించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి మందిరంలో బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఉదయం ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి శేష వాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ధ్వజారోహణకు నిడమానూరు మాలకొండయ్య, రజనిప్రియ దంపతులు, శేష వాహన సేవకు నంబూరు రవీంద్రకుమార్, జయమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో రాత్రి శేష వాహనసేవను వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా తాతా వెంకటకిశోర్‌కుమార్, హేమలత దంపతులు,కుటుంబ సభ్యులు వ్యవహరించారు.
- వేదాయపాళెం, త్యాగరాజనగర్‌లోని సద్గురు త్యాగరాజస్వామి మందిరంలో కొలువైన కోదండరామస్వామికి ఉదయం తిరుమంజన సేవ, అభిషేకం, ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సామూహిక హనుమంత సహస్రనామార్చన జరిపారు రాత్రి హనుమంత సేవ నిర్వహించారు. త్యాగరాజ మందిర కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



త్యాగరాజస్వామి మందిరంలో హనుమంతసేవ



బాలాజీనగర్‌లో శేష వాహనసేవ



హంస వాహనంపై సంతపేట ఆంజనేయస్వామి

అగ్ని ప్రమాదాలపై అవగాహన



నెల్లూరు(క్రైమ్): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నగరంలోని కోటమిట్ట అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశావర్కర్లకు అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో రోగులను ఏ విధంగా రక్షించాలో వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక సహాయ అధికారి ఎస్ వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు



నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికలు, నేర నియంత్రణా చర్యల్లో భాగంగా నగరంలోని లాడ్జిల్లో పోలీసు అధికారులు గురువారం అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. లాడ్జిల్లోని ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లాడ్జిల్లో బస చేసిన వారి వ్యక్తిగత వివరాలతో పాటు ఎన్ని రోజుల నుంచి బస చేస్తున్నారు..ఎక్కడ నుంచి..ఏ పని మీద వచ్చారు..తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. లాడ్జిల్లో బసచేసే వ్యక్తుల ఆధార్ నంబర్‌తో పాటు వారి పూర్తి వివరాలతో కూడిన రిజిష్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని లాడ్జిల నిర్వాహకులకు సూచించారు. ప్రతిరోజూ లాడ్జిల్లో బసచేసే వ్యక్తుల వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్ట విరుద్ధంగా ఎవ్వరికీ గదులు ఇవ్వరాదని, చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పడేస్తే చర్యలు



నెల్లూరు(బారకాసు): డ్రైనేజీల్లో మురుగు పారుదలకు అడ్డంకిగా మారుతున్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేస్తే జరిమానాలు విధిస్తామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ హెచ్చరించారు. నగరంలోని 9వ డివిజన్ కుసుమహరిజనవాడ ప్రాంతంలో జరుగుతున్న డ్రైనేజీల్లో పూడికతీత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో కాలువల్లో పూడికతీత, దోమల నివారణ చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని తెలిపారు. చెత్తను రోడ్లపై పడేయకుండా కార్పొరేషన్ చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడు మాత్రమే అందజేసి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. నగరంలోని వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, వ్యాపారులు తమ షాపుల వద్ద డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసి ప్రజలు వినియోగించేలా చూడాలని సూచించారు. అన్ని డివిజన్లలో డస్ట్‌బిన్ల ఏర్పాటుతో పాటు నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించండి

- ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



సంతపేట స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను ఎస్పీకి వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ మద్యం, నగదు అక్రమ రవాణాను కట్టడి చేయాలని ఎస్పీ కే ఆరీఫ్‌హఫీజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన సంతపేట పోలీసుస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలు, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, స్టేషన్ పరిధి తదితరాలను ఇన్‌స్పెక్టర్ సుబ్బారాజును అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలతో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని అక్కడి విషయాలను ముందస్తుగా సేకరించాలన్నారు. ఎంసీసీ ఉల్లంఘనులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఆయన పాత పోలీసు కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను సందర్శించి సీసీ కెమెరాలు, ఎల్‌హెచ్ఎంఎస్, వీడియోవాల్, డయల్ 100, దిశ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్ని సీసీ కెమెరాలు ఉన్నాయి? ఎన్ని పనిచేస్తున్నాయి? సీసీ కెమెరాల ద్వారా ఛేదించిన కేసులు, ట్రాఫిక్ నియంత్రణ, తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పనిచేయని వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. దిశ, డయల్ 100, 112కు కాల్‌వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగరాదన్నారు. కంట్రోల్‌రూమ్ పనితీరు బాగుందని కితాబిచ్చారు. ఆయన వెంట ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, డీటీసీ ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు ఉన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



19వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న హిమబిందు



21వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మొయిళ్ల గౌరి



59వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఆ పార్టీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కుమార్తె ఆదాల హిమబిందు కోరారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్‌లో శుక్రవారం ఆమె తన తండ్రికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందన్నారు. రూరల్ సమన్వయకర్తగా తన తండ్రి బాధ్యతలు చేపట్టాక ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. రూరల్ మరింత అభివృద్ధి చెందాలంటే త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, మాశెం సుధీర్‌కుమార్‌రెడ్డి, కాకుటూరు లక్ష్మీసునంద, పాశం శ్రీనివాస్, నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి, 19వ డివిజన్ ఇన్‌చార్జి పచ్చారవి, నాయకులు జల్లి కుమార్, ముడియాల రామిరెడ్డి, కొండేటి శివారెడ్డి, వేలూరు శ్రీధర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, కే సుకుమార్‌రెడ్డి, విజయలక్ష్మి, శివ, పట్టపు మల్లి, మోహన్‌కృష్ణ, సతీష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ దళిత నాయకుడు, రైల్వేబోర్డు సభ్యుడు స్వర్ణ వెంకయ్య పొట్టేపాళెం ఎస్సీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ సమగ్రాభివృద్ధికి నెల్లూరు ఎంపీ విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కోటేశ్వరరావు, బద్దిపూడి వెంకటరావు, ఎస్సీ సెల్ మాజీ సభ్యుడు బద్దిపూడి రవీంద్ర, బెల్లంకొండ వెంకయ్య, శ్రీనివాసులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.
- రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్‌లో ఆదాలకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోతురాజు రమాదేవి, వెంకటరామిరెడ్డి, రఘురామయ్య, రాజశేఖర్, నవీన్‌రెడ్డి , రమణారెడ్డి, మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.
- నెల్లూరు(బారకాసు): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 21వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మొయిళ్ల గౌరి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, వెంకటరత్నం, పెంచలనర్సారెడ్డి, రాజారెడ్డి, గల్లా శీను, శేఖర్, సాయి, రమణయ్య, బుజ్జన్న, మాల్యాద్రి, అక్బర్ పాల్గొన్నారు.
- నెల్లూరు(వీఆర్సీసెంటర్): 53వ డివిజన్ వెంకటేశ్వరపురం పరిధిలోని పునరావాస కాలనీ, పోస్టాఫీస్ వీధి, విజయ డెయిరీ, తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు వెంగళ్‌రెడ్డి, విజయ్, కళ్యాణ్, నిర్మల, వెంకట రమణమ్మ, శివ, గురుప్రసాద్, గురవమ్మ, తదితరులు, పాల్గొన్నారు.



రూరల్ మండలం పొట్టేపాళెంలో..



20వ డివిజన్‌లో...

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యం తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన బాలాజీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. తిరుమలరావు బాలాజీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. తిరుపతి జిల్లా గూడూరు ఇందిరానగర్‌కు చెందిన ఎం శ్రీనివాసులు(45) అప్పుడప్పుడు తిరుమలరావు వద్ద పనికి వచ్చి వెళ్లేవాడు. శ్రీనివాసులు కొంతకాలంగా అనారోగ్యంతో, మానసికస్థితి సరిగా లేక బాధపడుతున్నాడు. పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. శ్రీనివాసులు కొద్దిరోజులుగా తిరుమలరావు వద్ద ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలరావు అతనిని లేపి కూరగాయలు తీసుకు రమ్మని చెప్పగా మళ్లీ వెళతానని చెప్పి రూమ్‌లోనే ఉండిపోయాడు. అనారోగ్యం, మానసికస్థితి సరిగా లేని కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖ రాసి శ్రీనివాసులు ఫ్యాన్‌కు పంచెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాసులు ఎంతకీ బయటకు రాకపోవడంతో తిరుమలరావు రూమ్‌లోకి వెళ్లిచూడగా ఉరివేసుకుని కనిపించాడు. దీంతో జరిగిన విషయాన్ని మృతుడి అన్న సురేష్, బాలాజీనగర్ పోలీసులకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. ఏఎస్సై శ్రీనివాసరాజు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న సూసైడ్ లేఖను స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి అన్న సురేష్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- రైతుబజారు సబ్‌స్టేషన్ పరిధిలోని బోడిగాడితోట, వీవర్స్‌కాలనీ, లక్ష్మీపురం, సత్యనారాయణపురం, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.
- ఎన్టీఆర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతీనగర్, ఏసీనగర్, శ్రీనగర్‌కాలనీ, మున్సిపల్ క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 11.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.
- జగదీష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సాయినగర్, మారుతీనగర్, హెచ్‌పీ గ్యాస్ గోదాము పరిసర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.
- వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలోని జనార్దన్‌రెడ్డికాలనీ టిడ్కో గృహ సముదాయం, గోమతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామలింగాపురం, ముత్యాలపాళెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదు.
- బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వనంతోపుసెంటర్, ఉమ్మా రెడ్డిగుంట, రవీంద్రనగర్, పెద్దబాయి సెంటర్, మాగుంట లేఅవుట్, అన్నమయ్య సర్కిల్, లెక్చరర్స్‌కాలనీ, కింగ్స్‌కోర్టు అవెన్యూ, డీమార్ట్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

రేపు కవి సమ్మేళనం

నెల్లూరు(బృందావనం): సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో సాయంత్రం 5 గంటలకు 'మన నెల్లూరు–మన కీర్తి ప్రదాతలు' అనే అంశంపై కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన కవులు 78938 47709 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.